

# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 133 –

## మోసం

"**అక్కా.. అక్కా...** అదిగో అదే... ఆ భూలక్ష్మి అక్కడ వుంది చూడు. దొంగ మొహంది ఎన్నాళ్ళు తప్పించుకుని తిరుగుతుంది? పద పోయి పట్టుకుని నిలదీద్దాం" ఆవేశంగా అరిచింది మా పెద్దమ్మ కూతురు అమ్మణ్ణి.

సాలోచనగా అటు వైపు చూసాను నేను.

"రాక్కా... పోదాం అది చేసిన మోసం చిన్నదా చెప్పు. దానివల్ల ఎంత బాధ పడ్డాను నేను..! దాన్ని కొట్టినా తప్పు లేదు. నువ్వు కూడా గట్టిగా అడుగు" అంటూ చెయ్యి పట్టుకుని లాగింది అమ్మణ్ణి.

"సరే పద" అన్నాను అయిష్టంగా..

కువైట్ షాపింగ్ మాల్లో బట్టలు కొంటున్న భూలక్ష్మి దగ్గరికి వడివడిగా నడిచాం నేనూ అమ్మణ్ణి.

"ఒసేయ్.. భూలక్ష్మీ... ఎక్కడ దాక్కున్నావు? ఇన్నిరోజులూ ఏమై పోయినావు? నిన్ను పట్టుకోలేమనుకున్నావా?

నువ్వు చేసిన పని బాగుందా?" అంటూ భూలక్ష్మి భుజం పట్టుకుని గద్దించింది అమ్మణ్ణి.

మమ్మల్ని చూడగానే భూలక్ష్మి మొహం పాలిపోయింది. ఒక్క క్షణం కళ్ళలో భయం కదలాడింది.

"నా డబ్బు తీసుకుని కనపడకుండా మాయమై పోయావు. సెల్ ఫోను స్విచ్ ఆఫ్ చేసావు. నీ అడ్రస్ మాకు తెలియకపాయె. తెలిసిన వాళ్ళం, ఒక ఊరివాళ్ళం. మమ్మల్ని ఇట్ట మోసం చేస్తే ఎట్టా? ఊళ్ళోకి ఏ మొహం పెట్టుకుని వస్తావు చెప్పు?" అరిచింది అమ్మణ్ణి.

వెంటనే తేరుకుని "అయ్యో అలా అనకండి అక్కా.. మీ కాళ్ళు పట్టుకుంటాను. నా తప్పేమీ లేదు. ఆ దొంగ నా....

నన్ను కూడా మోసం చేసినాడు. అందరికీ ఏం జవాబు చెప్పాలో అర్థంకాక ఇట్టా నెత్తిమీద గుద్దేసుకుని మొహం చూపించకుండా తిరుగుతున్నాను. నా పాస్ పోర్ట్ కూడా వాడి దగ్గరే వుంది. మా నాయనకు వళ్ళు బాగలేదు రమ్మంటే ఇంటికి కూడా పోలేకున్నాను. వాణ్ణి నమ్మి నిండా మునిగిపోయాను, సావలేక బతికి వున్నాను" అంటూ గుడ్లనీళ్ళు కుక్కుకుంది.

"సర్లే నీ కాకమ్మ కథలు వింటే,  మేము బాగుపడినట్లే. ఇప్పటికైనా దొరికావు. సంతోషం. దొంగ ఏడుపులు కట్టిపెట్టి నా డబ్బు నాకివ్వు" భూలక్ష్మి గౌనుకున్న కాలర్ గట్టిగా పట్టుకుంది అమ్మణ్ణి.

"లేదక్కా నా మాట విను. మీ డబ్బు యాడికీ పోదు. నా కంఠంలో ప్రాణం వుండగా మీకు కట్టకుండా వుండను నన్ను నమ్మండి" ప్రాథేయ పడింది భూలక్ష్మి.

"నేను ఎక్కడన్నా బేంకీని దోచుకుని వచ్చినానా ఏంది? కువైట్ లో కష్టపడి సంపాదించిన డబ్బును నిన్ను నమ్మి రెండు వందల దినార్లు నీ చేతుల్లో ధారపోసాను.నీకు బుద్ధి వుందా? కనీసం జవాబు కూడా చెప్పకుండా పారిపోయినావు. మన ఊరిదానివనే కదా నిన్ను నమ్మాము? ఇలా ఎంతమందిని మోసం చేసి ఎంత దోచుకున్నావో ఏమో?

ఇంటికాడ మా చిన్నాయన కొడుకు మండిపడుతున్నాడు. నువు ఊళ్ళోకి వస్తే నీ సంగతి చెప్తా అని వాడు ఇంటికాడ కనిపెట్టుకుని కూర్చున్నాడు. నీ దగ్గర లేకపోతే మీ అమ్మకు ఫోన్ చేసి తీసుకున్న డబ్బును మర్యాదగా మా తమ్ముడికి ఇమ్మని చెప్పు. మర్యాద వుంటాది. లేదంటే నువ్వు ఊళ్ళోకి అడుగు పెట్టలేవు. నీ వలన మాకెంత నష్టం చెప్పు?" కోపంగా అరిచింది అమ్మణ్ణి.

"అక్కా... మా అమ్మ పరిస్థితి కూడా బాగలేదు. కొన్ని రోజులు ఆగండి. మొత్తం నేనే కడతాను. నన్ను నమ్మండి" చేతులు పట్టుకుంది భూలక్ష్మి.

"అమ్మో... ఇప్పుడు నిన్ను వదిలితే మళ్ళీ దొరుకుతావా? పరిస్థితి బాలేకపోతే ఇంటికాడ అంత పెద్ద మిద్దె ఎలా కట్టినావో చెప్పు..! ఇక నేను నీ మాటలు అస్సలు వినను. ఈ రోజు తాడో పేడో తేలిపోవాలి అంతే..."మొండికేసింది అమ్మణ్ణి.

"ఓక్కా... నువ్వయినా చెప్పు" అంటూ నా చేతులు పట్టుకుంది భూలక్ష్మి. నేను ఏమీ చెప్పలేక, ఎటూ మాట్లాడలేక పేలవంగా నవ్వాను.

"సరే ఇక్కడ గొడవ ఎందుకు? అందరూ మనల్నే చూస్తున్నారు. కువైటీస్ చూస్తే బాగోదు. బయట ఖర్జూరపు చెట్టుకింద వున్న బెంచీ మీద కూర్చుని మాట్లాడుకుందాం పదండి" అన్నాను.

"ఈ రోజు నిన్ను వదలను, పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్తాను. నీతోపాటూ నన్నూ సాపర్ పంపించినా సరే..." అంది అమ్మణ్ణి.

నేరకపోయి అమ్మణ్ణితో షాపింగ్ కు వచ్చి ఈ గొడవలో ఇరుక్కుపోయానే అని మనసులో విసుక్కుంటూ బయటకు నడిచాను నేను.

దాదాపూ అర్థగంట ఇద్దరిమధ్యా వాగ్వాదం జరిగింది. అమ్మణ్ణి తగ్గలేదు. తను పడిన బాధ అలాంటిది..! అప్పులు చేసి వీసాకు కట్టింది.

నా దగ్గర కూడా యాభై దినార్లు తీసుకుని తిరిగి ఇచ్చేసింది. దాదాపూ పది నిముషాలు ఇద్దరూ ఒకరిపై ఒకరు పదునైన మాటలు విసురుకున్నాక ఆఖరికి భూలక్ష్మి మెళ్ళో వున్న చైను లాక్కుని, ఫోను నంబర్ ను తీసుకుని "ఇది వడ్డీలోకి మాత్రమే, తీసుకున్న అసలు తొందరలో నువ్వు ఇవ్వాలి, లేకపోతే నీ సంగతి చూస్తా" అంటూ వదిలింది అమ్మణ్ణి.

హమ్మయ్య తుఫాను వెలిసినట్లుంది అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాను నేను.

బంగారపు చైను చూసుకుంటూ పది గ్రాములైనా వుంటుందో వుండదో... వడ్డీలోకి కూడా రాదు.

"దీన్ని నమ్మి డబ్బు తెచ్చిఇచ్చి రెండేళ్ళకు ఎంత వడ్డీ కట్టానో నేను" వాపోయింది అమ్మణ్ణి...

అమ్మణ్ణి ఆ గొలుసును చూసి మురిసిపోతుంటే, నాకు మాత్రం భూలక్ష్మి కళ్ళలో కదలాడిన రకరకాల భయాలు, ఆందోళనలు గుర్తొచ్చాయి.

నిజంగానే తను మోసం చేసిందా? లేక ఆ ఏజెంట్ చేతిలో తను కూడా మోసపోయిందా? అనే సందేహం నన్ను తొలిచేస్తోంది.

ఎందుకంటే నెలరోజుల క్రితం అర్జంటుగా కావాలని నెలజీతం రాగానే ఇస్తానని నా వద్ద వంద దినార్లు తీసుకెళ్ళింది. భూలక్ష్మి ఏదో కష్టం చెప్పగానే విని ఆమె కన్నీళ్ళు చూసి కరిగిపోయి డబ్బు ఇచ్చేసాను. ఇప్పుడు అమ్మణ్ణితో పాటూ నేను కూడా మోసపోయానా..!

ఓహ్... కొంచెం బాధగా తల విదిలించాను.

రెండురోజులు గడిచాయి. ఒకరోజు అమ్మణ్ణి కంగారుగా నా గదికి పరిగెత్తుకుంటూ వచ్చింది. తన చేతిలో ఆ గొలుసు ఉంది.

"అక్కా... ఎంత మోసం చేసిందో ఆ భూలక్ష్మి. ఇది బంగారం కాదు... రోల్డ్ గోల్డ్ గొలుసు! ఆ భూలక్ష్మి నన్ను మళ్ళీ మోసం చేసింది!" అంటూ బావురుమంది అమ్మణ్ణి.

నేను నిర్ఘాంతపోయాను. "అదేంటి అమ్మణ్ణీ... అంత నమ్మకంగా ఇచ్చింది కదా!" అన్నాను. మేమిద్దరం వెంటనే ఆ రోజు తను ఇచ్చిన ఫోన్ నంబర్‌కు ట్రై చేశాం. స్విచ్ ఆఫ్ చేసి వుంది. మళ్ళీ అదే పాత కథ.

అమ్మణ్ణి కోపంతో ఊగిపోతూ, "ఈసారి దొరికితే మాత్రం వదిలేది లేదు, నేను కువైట్ లో జైలుకు వెళ్ళినా పరవాలేదు. దాన్ని చంపేస్తాను" అని అరిచింది.

కానీ, విధి విచిత్రమైనది. నెల రోజుల తర్వాత మాకు తెలిసిన ఒకరు ఫోన్ చేసి "భూలక్ష్మి హాస్పిటల్ లో వుందని అక్కడికి వెళితే దొరుకుతుందని" చెప్పారు.

నేను, అమ్మణ్ణి వెంటనే "మమ్మల్ని ఎందుకు మోసం చేసావని" గట్టిగా అడగాలనే అక్కడికి వెళ్ళాము.

అక్కడ జనరల్ వార్డులో ఒక మూలన దీనంగా పడుకుని ఉన్న మనిషిని చూసి మేము షాక్ అయ్యాము. అది భూలక్ష్మి! కానీ ఆమె ముఖం పీక్కుపోయింది, కళ్ళు లోతుకు పోయాయి. ఎముకల గూడులా గుర్తుపట్టేలా లేదు.

మమ్మల్ని చూడగానే తను ఏడవటం మొదలుపెట్టింది. అమ్మణ్ణి తిట్టడానికి నోరెత్తి ఆమె పరిస్థితి చూసి ఆగిపోయింది.

"అక్కా... ఆ రోజు నేను ఇచ్చింది నకిలీ గొలుసని నాకు తెలుసు. కానీ అప్పుడు మీ దగ్గర నుండి తప్పించుకోవడానికి నాకు వేరే దారి లేకపోయింది. నా పాస్‌పోర్ట్ ఏజెంట్ పట్టుకుపోయాడు, జీతం రాక మూడు నెలలైంది. అనారోగ్యంతో ఇక్కడ పడి ఉన్నాను. నాకూ మోసం చేయాలని లేదు అక్కా... కానీ నా బతుకు నన్ను ఇలా మార్చేసింది. మీ డబ్బులు ఎగ్గొట్టను. ఇంటికి వెళ్ళాక నా మిద్దె అమ్మి అయినా సరే మీ బాకీ తీరుస్తాను" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

అమ్మణ్ణి చేతిలో ఉన్న నకిలీ గొలుసును చూసి, తర్వాత భూలక్ష్మి దీనస్థితిని చూసి నిశ్శబ్దంగా ఉండిపోయింది.

ఆ గదిలో ఉన్న వాతావరణం భారంగా మారింది. ఎలా వున్న భూలక్ష్మి ఎలా అయిపోయింది. పరాయిదేశంలో ఏజెంటును నమ్మి వీసా వ్యాపారం చేద్దామనుకుని అప్పులపాలై, జబ్బుపడి హాస్పిటల్లో దిక్కులేకుండా పడి వున్న భూలక్ష్మి వైపు జాలిగా చూస్తున్నాను నేను. కన్నీళ్ళు విడుస్తూ భూలక్ష్మి మా వైపు దీనంగా చూస్తోంది.

కొన్ని క్షణాలు మౌనంగా కరిగాయి. అమ్మణ్ణి కూడా అచేతనంగా నిలబడి తర్వాత నోరు తెరిచి

"చూశావా అక్కా... ఇక్కడ ఎవరి కష్టం ఎవరికో తెలీదు. ఒకడు మోసం చేస్తే, ఇంకొకడు బలి అవుతాడు. ఏజెంట్ చేసిన మోసానికి ఈమె బలైంది, ఈమె చేసిన పనికి నేను అప్పుల్లో కూరుకుపోయాను. ఒకరిని ఒకరు నిందించుకోవడం తప్ప ఇక్కడ ఎవరికీ శాంతి లేదు" అంది ఆవేదనగా.

తర్వాత

అమ్మణ్ణి తన దగ్గరున్న నకిలీ గొలుసును అక్కడే టేబుల్ మీద పెట్టి, తన సంచిలో ఉన్న కొన్ని దినార్లను తీసి భూలక్ష్మి చేతిలో వుంచింది.

"ఇదిగో ఈ ఇరవై దినార్లు మందులకు ఉంచుకో. డబ్బులు పోతే పోయాయి, కనీసం ప్రాణంతో ఇంటికి చేరుకో. ఆ మిద్దెలు, మేడలు మనల్ని కాపాడవు లక్ష్మీ... మనుషులే ముఖ్యం" అని చెప్పి వెనుతిరిగింది.

పరదేశంలో ఇంత జబ్బు పడ్డ భూలక్ష్మి ఇండియాకు తిరిగి వస్తుందో రాదో, మా డబ్బు తిరిగి వస్తుందో లేదో కానీ ఆ పరిస్థితిలో ఆమెను చూసి మా హృదయాలు కరిగిపోయాయి.

నేను వంద దినార్లు భూలక్ష్మికి ఇచ్చినట్లు అమ్మణ్ణికి చెప్పలేదు. చెప్పను కూడా...

బయటకు వస్తుంటే నాకు అనిపించింది. పరాయి దేశంలో పొట్టకూటి కోసం వచ్చి, ఒకరిని ఒకరు మోసం చేసుకుంటూ, చివరికి అందరం ఏదో ఒక రూపంలో బాధితులమే అవుతున్నామని.

ఎడారి ఇసుకలో నీటి చుక్కలాగే, ఇక్కడ మనుషుల మధ్య నమ్మకం కూడా ఆవిరైపోతోంది. అమ్మణ్ణి కోపం వెనుక ఉన్న నీతి, భూలక్ష్మి నిస్సహాయత వెనుక ఉన్న అబద్ధం ఈ రెండూ ఈ 'పరదేశి' బతుకు చిత్రాలే!!

(మరోకథ వచ్చేనెల)

Post your comments